

# మోడు చిగురించింది

డి. దత్తాసాగర్

నల్లని తారురోడ్డు ఇరువైపుల వున్న పంట పొలాలను చీల్చుకుంటూ ముందుకు పోతూంది. అప్పుడప్పుడూ ఆ రోడ్డుమీద వేగంగా తరలి పోతున్న బస్సులు, వాటిల్లో ఇరుప్రక్కల కనుల పండువుగా ఉండి హృదయాలకు ఆహ్లాదాన్ని అందిస్తున్న హాయిదనాన్ని ఆస్వాదిస్తూ వెడలిపోయే ప్రయాణీకులు. అక్కడక్కడ మానవాళి సహాయార్థం శరీర పరిశ్రమను దానం చేస్తున్న కష్టజీవుల సమూహాలూ. వారితోపాటు తమ వెలలేని సహాయాన్ని మానవులకు పంచియిస్తు విరామమెరుగక భూమిదున్నే నోరులేని మూగజీవాలు తమ తెల్లని సౌందర్యాన్ని బురదతో నింపిన అదో మాదిరి రంగుగా మార్చుకొని బురదరకలు లాగుతున్నాయి. వాటితోపాటు మోకాటి లోతు బురదలో దిగబడిన కాళ్ళను అతి ప్రయాసంగా లాక్కుంటూ విసుగూ విరామం లేకుండా నిరంతరం ఆరక వెంబడి తిరిగే రైతుకూలీలు. వారు అంతటి కష్టాన్ని భరిస్తున్నా ఏమీ ఎరుగనట్టు అమాయక దరహాసం వారి ముఖాల్లో తొంగి చూస్తుంది పౌర్ణమినాటి చంద్రుడిలా.

అక్కడక్కడ నల్లని మాగాణిలో పచ్చని నారుమళ్లు. ఆ నారు పీకి కట్టలు కట్టుతున్న పాలేరు. ఆ కట్టలను వయ్యారంగా, పాటలు పాడుతూ పరాచకాలు ఆడుతూ ఆనందంగా భూదేవిగర్భంలో నాటువేస్తున్న ఆడకూలీలు. రంగు రంగుల నేత చీరలు కట్టి, తొడలు కనబడేలా చీరలు పైకి మలిచి గోచీపెట్టి పోటీపడి నాటువేస్తున్న కన్యలు. వారు నాటుతున్న నారు మొక్కలు భూమిలో నిలబడి అందమైన అంగనల కరస్పర్శతో పులకాంకితులై తలలు వంచుకున్నాయి సిగ్గుతో. నారు మొక్కలతో పచ్చబడిన భూమి నూతన శోభతో వుప్పొంగిపోతూ వొంగి నాటువేస్తున్న అతివలను చూచి ధీమాగా దర్పంగా నవ్వుతుంది. ఈ సహజ సౌందర్యానికి ముగ్ధులైన కొండెగాళ్ల చూచే వోర చూపులకు పరవశించిపోతున్న కన్యలు నూతనోత్సాహంతో ముందుకు పోతున్నారు శరీరకష్టాన్ని కూడా విస్మరించి. అది దృశ్యం కాదు. తియ్యని స్వప్నం. సహజ సౌందర్యానికి పునాది. కవుల హృదయాల మీద అమృతవర్షం లాంటిది. భారతీయ సంస్కృతికి కళాఖండం. పేదప్రజల రక్తానికి యదార్థ స్వరూపం. తాము చేసిన కష్టానికి ప్రతిఫలంగా కలిగినమార్పును చూచిన రైతులు విజయగర్వంతో వెనుదిరిగి చూస్తున్నారు. వారి ముఖాల్లో నూతనోత్సాహం కనిపిస్తుంది. కళ్ళల్లో క్రొత్తజ్యోతులు వెలుగుతున్నాయి. వ్యవసాయపనులన్నీ చకచకా సాగిపోతున్నాయి. ఎవరి పనుల్లో వారు నిమగ్నమై వున్నారు. క్షణం తీరికలేదు.

చూస్తూ ఉండగానే పశ్చిమాద్రి సూర్యుడు పయనిస్తున్నాడు, ఎర్రగా నెత్తురు కక్కుతున్న ఆకాశం క్రిందుగా పక్షులు దారులుతీరి తమతమ నెలవులకు వెళ్ళిపోతున్నాయి. పశువుల కాపరులు ఇక యింటికి చేరుకుంటున్నామన్న ఉత్సాహంతో ఆవరించిన నీరసాన్ని అతిక్రమించి, ఉరుకులకి పశువులను మళ్లేస్తున్నారు. కూలీజనమంతా ఒక్కసారి తాము చేస్తున్న పనులు నిలుపుచేసి, ఇంటికెళ్ళే ప్రయత్నంలో కాళ్లచేతులు స్వచ్ఛమైన కాలువనీటిలో శుభ్రపరుస్తున్నారు. రైతులూ, పాలేర్లూ తమ అభిమానపాత్రమైన ఎడ్లను ప్రేమపూరితంగా స్పృశిస్తూ శరీరాలను శుభ్రపరుస్తున్నారు. దినమంతా పని చేసినా, యింటికి వెళ్లుతున్నామన్న సంతోషంతో ఎద్దుల కాటుకకళ్ల మెరుస్తున్నాయి ఆనందంగా. కూలీ జనాంగమంతా అమాయకంగా నవ్వుతున్నప్పటికి బడలికవలన ఏర్పడిన గుర్తులేవో వారి ముఖాలమీద కొట్టొచ్చినట్టు కనబడుతున్నాయి స్పష్టంగా.

రోడ్డు కడ్డంగా పంటకాలువకోసం నిర్మించబడిన బ్రిడ్జిమీద కాలుబెట్టి ఈ వాతావరణాన్ని తిలకిస్తున్న "శ్రీధర్" హృదయం అనిర్వచనీయమైన ఆనందాన్ని అనుభవిస్తుంది. ప్రకృతివలన కూలీలకే శోభ చేకూరిందో - లేక కూలీలవలనే ప్రకృతికే శోభ చేకూరిందో గాని వారిరువురిమధ్య అవినాభావ సంబంధం, అపరిమిత సాన్నిహిత్యం వుందనుకున్నాడు శ్రీధర్ తనలో తాను. ఈ విధమైన వూహాజగత్తులో తేలిపోతున్న శ్రీధర్ ప్రక్కగా గృహాభిముఖులైన కష్టజీవులసమూహాలు గుంపులుగా తరలిపోతున్నారు. ఆ గుంపులో ఎవరికోసమో శ్రీధర్ కళ్ళు ఆతృతగా అన్వేషిస్తున్నాయి. వెళ్ళిపోతున్న జనాన్ని చూచిన ప్రకృతి గుండెల నిండా తెల్లనివెన్నెలలా చల్లగానవ్వుకుంది. చల్లగాలి అమ్మాయిల కురులతో చిలిపిగా ఆడుకుంటుంది. ముందుగా నాటువేయబడిన పైరు అప్పుడే వేళ్ళు పాతుకొని పచ్చదనాన్ని చేకూర్చుకొని చల్లగాలి చిలిపి తాకిడికి పరవశించిపోతూ సిగ్గుభారంవలన తలలువంచి వెళ్ళిపోతున్న తమ నేస్తాలకు తమ హృదయపూర్వకమైన వీడ్కోలు చెబుతున్నాయి.

ప్రకృతి ఎంత అందమైంది! అనుకున్నాడు శ్రీధర్. ఎప్పుడూ బస్సులూ, లారీలూ, కార్లూ, రిక్షాలూ, పెచ్చరిల్లిన జనసమూహాల రణగొణధ్వనులతోకూడిన కృత్రిమ వాతావరణంలో కూరుకుపోయిన తన బస్తీ ఎక్కడ! - కొత్త పెళ్ళికూతురులా నిత్య నూతన శోభలతో కన్యతలంపులకన్నా తియ్యనై హృదయాన్ని ఆనందడోలికల్లో వూగించే యీ పల్లెవాతావరణమెక్కడ? అనుకున్నాడు.

మధూ ... యిక నేను వెళ్ళొస్తాను. ఇప్పుడు నీ భర్త చూస్తే మరీ ప్రమాదం. నిన్ను ఆదరించ లేకపోయినా నీ అందాన్ని నాశనం చేసిన వాణ్ణవు తాను. అందులో పురుషుడు సంకుచిత బుద్ధి అహంభావి. ఈర్ష్యాపరుడు. అటువంటి భావాలూ, చూపులు కూడా సంకుచితమై రోజగలిగించేవి ఆ జాతిలో పుట్టినవాణ్ని కనుక నా జాతి లక్షణా లేమిటో నాకు తెల్సు - అంటూ దుప్పట్లో ముసుగు కప్పుకునివెళ్ళాడు. వెనుదిరిగి వెళ్ళిపోతున్న శ్రీధర్ చీకట్లో కలిసిపోయిందాకా చూసి, గాఢమైన నిట్టూర్పు ఒకటి విడిచింది. ఆ నిట్టూర్పులో ఎంత వేదుందో ఎవరికి తెల్సు. దేవుని పాదాల మీద అంకితమైన పుష్పంలాగా తన పాదాల మీద పడి వాడిన అంటిపెట్టుకున్న ఉత్తరాన్ని తీసుకొని భారమైన అడుగులతో బయలుదేరింది యింటికి.

మాధవి వంటపని త్వరత్వరగా ముగించుకొని, భర్త యింకా పొలంనుంచి రానందువలన జాకెట్లో భద్రంగా దాచుకున్న ఉత్తరం తీసి లాంతరువత్తి ఎక్కించి, యీ విధంగా చదవసాగింది.


ప్రియమైన మధూ...

నిన్ను చూడాలని కొండంత ఆశగావుంది. ఆ ఉద్దేశంతోనే మీ ఊరు వచ్చానంటే బహుశా నువ్వు నవ్వుతావేమో? కఠిన శిలలో యింత చలనం కలిగిందాని నువ్వు ఆశ్చర్యపడొచ్చు. నీ ఆశ్చర్యానికి కూడా ఆస్కారం లేకపోలేదు. పశువుకంటే హీనంగా, రాక్షసుడికన్నా ఘోరంగా నిన్ను బాధించిన నేను నిన్ను చూడటానికి వచ్చానంటే ఆశ్చర్యపడకుండా ఎలా వుండగలవు? మరొక విషయమేమిటంటే అప్పట్లో నేను మీ ఊరువెళ్ళి విచారించగా నీ పెళ్ళి అయిపోయిందని తెల్సింది. అప్పుడు నేను పడినబాధ ఎలాంటిదో చెప్పటంకన్నా ఆ తర్వాత ఏం జరిగిందో చెప్పటం ముఖ్యం.

నీవు పెళ్ళిచేసుకున్నతర్వాత నీమీద నాకు అసహ్యం వేసింది. నిన్ను మర్చిపోవటానికి నా శాయశక్తులా ప్రయత్నం చేశాను. కొంతవరకు కృతకృత్యుణ్ణికూడా కాగలిగాను. కాని... మాధవీ ఈ మధ్య ఒక గొప్ప విశేషం జరిగింది. అదేమిటంటే ఈ మధ్య ఓ వారపత్రికలో ఒక చక్కని కథ చదివాను. నిజంగా కథలువేరూ జీవితంవేరు అంటారు కొందరు. కాని నాకు జరిగిన అనుభవాన్ని పురస్కరించుకొని అలాకానేకాదు అనుకుంటున్నాను. కథలు మనిషి జీవితంమీద ప్రభావాన్ని కల్గిస్తాయనడంలో అతిశయోక్తి ఎంత మాత్రంలేదు. ఆ కథ చదివినతర్వాత నన్ను నేను పరిశోధించుకోవలసిన అవసరం ఏర్పడింది. ఆ పరిశోధనలో పదేపదే నీ స్వరూపం కనబడసాగింది. మర్చిపోయాననుకున్న నీవు అనుక్షణం నన్ను వెంటాడటం మొదలుపెట్టావు. యిది కథ ప్రభావంగాక ఏమవుతుంది. మన వివాహందగ్గర్నుండి వర్తమానంవరకు మధ్య జరిగిన విషయాల గురించి ఆలోచించాను.

ఒక్కొక్క సంఘటన వరసగా నా ముందు ప్రత్యక్షమవసాగింది. నిజంగా మధూ...అప్పట్లో నీవు చేసే ప్రతిదీ తప్పుగానే కనిపించేది నాకు. అలా ఎందుకు కనబడుతుందో యిప్పు డర్థమౌతుంది. మనిషిలో కుత్సిత స్వభావం స్థానం ఏర్పర్చుకున్నప్పుడు. ఆలోచనలూ, భావాలూ వ్యాకిగ్రస్తమైనప్పుడు. తనుచూసే ప్రపంచమంతా అలానే కనిపిస్తుంది. మాధవీ...నిన్ను నేను ఏ విధంగా హింసించానో! నీదపరిచానో! ఊహించుకుంటేనే గుండెలు బ్రద్దలవుతున్నాయి. నేను మరి నువ్వుకాబట్టి ఆ ఘోరబాధల్ని సహించి వూర్కో గలిగావు. నీ స్థానంలో మరొకరుంటే ఎప్పుడో తనదారి తను చూసుకొనేవారు.

మాధవీ...ముఖ్యంగా ఆ రోజు రాత్రి నిన్ను ఎంత ఘోరంగా హింసించాను. నీ గుండెలమీద కత్తిపెట్టి పలానావాడితో నీకు సంబంధం లేదా? ఎన్ని రోజులనించి ఈ నాటక మాడుతున్నావో చెప్పు...లేకపోతే ఈ కత్తి నీ గుండెలోకి దిగుద్ది అని నేను రాక్షసుడిలా పిశాకోధాన్ని కక్కుతోంటే కళ్ళల్లోంచి నిప్పులు చెరుగుతోంటే నువ్వేంచేశావు. ఏమి చేయగలవు? పులి పంజాలో చిక్కిన లేడివలె నువ్వు గజగజ వణికిపోతూ నావేపు చూసిన జాలి చూపులు నన్ను అప్పుడే ఎందుకు దహించి వేయలేదో? కాని...యిప్పుడది




అనుక్షణం నన్ను సజీవంగా దహించివేస్తున్నాయి. యిలాంటి సంఘటనలు ఎన్ని జరగలేదు. ఎన్ని కట్టెలు నీ మృదువైన శరీరం మీద విరగలేదు. నీది ఎంత కన్నీరు నేను తాగలేదు. యిలాంటి భయంకరమైన కాళరాత్రులు ఎన్ని గతించలేదు? ఎంతమందితో నీకు రంకు గట్టి నిన్నవమానించలేదు. నీవు ఎన్ని రోజులు యిలాంటి కత్తులమీద నడకలాంటి జీవితాన్ని వెళ్ళబోయలేదు. అవన్నీనాకిప్పుడు గుర్తుకొస్తుంటే? నేనెంత మూర్ఖున్నయానో అర్ధమవుతుంది. అప్పుడే నువ్వు తిరుగుబాటుచేసి నన్నెందుకు హత్యచేయకుండా వున్నావానిపిస్తుంది.

గాఢాంధకారం లాంటి గతాల్ని జ్ఞాపకం చేసి నిన్ను బాధపెట్టాలని నా వుద్దేశం కాదు మాధవీ... నా మీద యింకా ఏమైనా సానుభూతి మిగిలివుంటే అది వ్యర్థమని తెలియ చేయటం కోసమే. ఇంకా మన జీవితంలో జరిగిన నికృష్ట ఘటియల గురించి వ్రాయాలంటే కాలమే సరిపోదు. ఆ ఘటనలన్నీ సంపూర్ణంగా రాయాలంటే ఆపాటికి నా ప్రాణాలే పోవచ్చు. పోనీలే మాధవీ ... నన్ను క్షమించు. నాకింకా యీ పాడుబ్రతుకు బ్రతకాలని వుంది. మనిషివలె కొన్ని ఘడియలైనా జీవించాలని ఆశవుంది. నేను బ్రతకాలని అనుకుంటున్నానూ అంటే కేవలం అందుకోసమే.

మాధవీ...నిన్ను నేను ఒక విషయంలో అభినందించే సాహసం చేస్తున్నాను. ఆ అర్హత నీకె క్కడిదని నువ్వనుకున్నా సరే అభినందించక తప్పదు. అనుక్షణం పురుషుడి ఇనుప పాదాల క్రింద నలిగిపోతున్న స్త్రీలకు నీ చర్యద్వారా ఒక వెలుగురేఖను చూపావు. పాతివ్రత్యమనే మూఢ నమ్మకంతో అహంకార పూరితుడైన పురుషుడి పదఘట్టనలో నిర్దయగా నలిగిపోతున్న అనేక అభాగినులకు పునర్వివాహం ద్వారా ఒక ఉదాత్తమైన గమ్యాన్ని చూపావు. స్త్రీకి శీలం అవసరమే కాని, దానికి విలువలేనిచోట దాన్నె పట్టుక్వేలాడి తమ జీవితాల్ని నరకప్రాయం చేసుకొనే స్త్రీ మూర్తులకు నీ చరిత్ర ఒక పట్టుగొమ్మ.

మధూ ఒకప్పుడు ఎంతెక నెరుగక సుకుమారంగా జీవించిన నువ్వు. ఈనాడుకూలీల్లో ఒక కూలీగా మారి యింతటికాయకష్టాన్ని ఎలా భరించగలుగుతున్నావు? నువ్వు చదువుకున్నా నీ చదువును గ్రహించి నీకు సరిపోను ఉద్యోగం యిచ్చేదెవరు? దరిద్రుల కాలవాలమైన యీ విశాల భారతంలో పెద్దపెద్ద చదువులు చదివినవాళ్ళే దేశద్రిమ్మరులై తిరుగుతుంటే! యిక నీ బోటి అనామధేయుల్ని పట్టించుకునే దెవరు? అవకాశం దొరికితేనే స్త్రీని అవహేళనచేసే యీ సంకుచిత సంఘంలో నీ చర్యను శ్లాఘించేవారెవరు?

మరి ముఖ్యముగా మాధవీ... శరీర కష్టానికి అలవాటుపడి, శ్రమసౌందర్యాన్ని అలవరచుకున్న నీ ఆత్మస్థైర్యానికి, నీ పట్టుదలకూ సోమరిపోతులై పూర్తిగా పురుషునిమీద ఆధారపడే స్త్రీలు సిగ్గుపడాలి తను కష్టపడకుండా పురుషుడిమీద ఆధారపడి అవకాశం దొరికినపుడల్లా అవినీతికి లోబడి స్త్రీకి స్వాతంత్ర్యము కావాలనే తెగవాగే స్త్రీల మీదకన్నా నీ లాంటి స్త్రీల మీదనే గౌరవం ఏర్పర్చుకోవటం అలవాటు చేసుకున్నాను. పురుషుడితో సమంగా కష్టపడి నైతికంగా కట్టుబడి సమానత్వాన్ని కోరమని నీలాంటి స్త్రీలను నేను ప్రబోధిస్తాను. నాలాంటి మూర్ఖులైన పురుషుల మూఢత్వాన్ని బద్దలు కొట్టమని నీలాంటి స్త్రీలను కోరుతాను. నేనీనాడు నిజాన్ని గ్రహించగలిగానంటే నువ్వే కారణం. ఒక విధంగా నువ్వొక విప్లవ కారిణివి.

మాధవీ...యిప్పటికే ఏవేవో వ్రాసి నీకు విసుగు కలిగించి వుంటాను. ఈ వుత్తరమంతా సాంతం చదివావనే నమ్ముతున్నాను. ఇప్పుడు నీవు నీ భర్తతో సుఖంగానే జీవిస్తున్నావనుకుంటాను. నేను కోరేది కూడా అదే. ఇప్పుడీ విషయమంతా వ్రాసి నీ దయకు పాత్రుణ్ణవాలన్న స్వార్థపరుడిగా భావించకోకు. కేవలం ఒక మోడు చిగురించిందని నీకు తెలిస్తే సంతృప్తి.

ఇట్లు
శ్రీధర్.

ॐ